ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
శనివారం 15 మార్చి 2025






	ఇఫ్తార్	సెహరి
	శనివారం	ఆదివారం
కర్నూలు	6:33	5:04
నంద్యాల	6:30	5:04







దిగువ అహోబిలంలో రథంపై కొలువైన ఆది దంపతులు

దిగువ అహోబిలంలో రథోత్సవం

నమో.. నారసింహా..

- వైభవంగా ప్రహ్లాద వరద స్వామి రథోత్సవం
- దిగువ అహోబిలంలో కమనీయంగా వేడుక
- భక్తజన సంద్రంగా మారిన అహోబిల క్షేత్రం
- ఎగువలో జ్వాలా నృసింహ స్వామికి విశేష పూజలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 14(ఆంధ్రజ్యోతి) : భక్తుల గోవింద నామస్మరణ, వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య దేవదేవుని రథోత్సవం శుక్రవారం కన్నులపండువగా సాగింది. అహోబిలం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దిగువ అహోబిల క్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాద వరదస్వామి ఉత్సవమూర్తులు కొలువైన బ్రహ్మరథం ఆలయ మాడవీధుల్లో కదిలి వస్తుండగా భక్తకోటి పారవశ్యంతో తన్మయత్వం చెందింది. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్, ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు అర్చకులు పంచామృతాభిషేకం, నవకలశ తిరుమంజనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాద వరద స్వామిని పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలు, పూలమాలలతో విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. అహోబిలేశుడు ఉభయ దేవేరులతో కలిసి రథాన్ని అధిష్టించి తిరువీధుల్లో విహరిస్తుండగా దిగువ అహోబిల క్షేత్రం భక్త జనసంద్రంగా మారింది. రథోత్సవం సందర్భంగా చిన్నారులు, మహిళలు నిర్వహించిన కోలాట ప్రదర్శనలు, కళాకారుల వేషధారణలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

'దిగువ'లో నేడు గరుడోత్సవం

అహోబిలం వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా దిగువ అహోబిలంలో శనివారం రాత్రి గరుడోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు ఉత్సవం, తీర్థవారి చక్రస్నానం నిర్వహిస్తారు. ప్రహ్లాద వరదస్వామిని శ్రీదేవి, భూదేవి సమేతంగా ఆలయ మండపంలో కొలువు ఉంచి పంచామృతాభిషేం, నవకలశ తిరుమంజనం నిర్వహించిన అనంతరం ద్వాదశ ఆరాధనం, పుష్పయాగం, గరుడోత్సవం, ధ్వజావరోహణం చేపడతారు.

'ఎగువ'లో వైభవంగా ద్వాదశ ఆరాధన :

అహోబిలేశుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో ఉభయ దేవేరులతో కొలువైన జ్వాలా నరసింహస్వామి ఉత్సవ మూర్తులకు అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు సాంప్రదాయబద్ధంగా ఉత్సవం నిర్వహించారు. అనంతరం ద్వాదశ ఆరాధనం శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆరాధన దోషాలను నివృత్తి చేసుకోవడం కోసం తిరువారాధన చేసి స్వామి, అమ్మవార్లకు అర్చకులు నైవేద్యం సమర్పించారు.

నేత్రపర్వంగా పుష్ప యాగం

ఎగువ అహోబిల క్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు శుక్రవారం రాత్రి వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత జ్వాలా నరసింహ స్వామి ఉత్సవమూర్తులను యాగశాలలో కొలువు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఉభయ దేవేరులతో ఆశీనుడైన శ్రీవారికి దేశ నలుమూలల నుంచి సేకరించిన సువాసనలు వెదజల్లే, సుమధుర సుగంధాలు విరజిమ్మే వివిధ రకాల పుష్ప, పత్రాలతో నేత్రపర్వంగా పుష్పార్చన నిర్వహించారు.



రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు

27.5 లక్షల చేప పిల్లలు విడుదల

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల నుంచి శ్రీశైలం, వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లలో 27.5 లక్షల చేపపిల్లలను వదిలినట్లు జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరక్టర్ ఏపీ రాఘవరెడ్డి తెలిపారు. కర్నూలు చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం నుంచి శ్రీశైలం రిజర్వాయర్‌లో 15 లక్షలు, వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 7.5 లక్షలు, సబ్సిడీపై 5 లక్షలు కలిపి మొత్తం 27.5 లక్షల చేపపిల్లలను వదిలినట్లు వివరించారు. జిల్లాకు 105 మిని ఫిష్ ఆంధ్రా యూనిట్‌లు మంజూరు కాగా, 53 గ్రౌండింగ్ అయ్యాయని, ఒక్కో యూనిట్‌కు కేంద్రం నుంచి 24 శాతం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 16 శాతం సబ్సిడీతో మంజూరు చేశామని చెప్పారు. ఒక్కో యూనిట్ విలువ రూ.72 వేలు కాగా 60 శాతం లబ్ధిదారుడే భరించాలన్నారు. కేంద్రాల్లో ఎండు చేపలు, ఎండు రొయ్యలు పెట్టుకోవాలని సూచించినా లబ్ధిదారులు మక్కువ చూపడం లేదని తెలిపారు. మత్స్యకారులు వలలు, పుట్టీలు, ద్విచక్ర వాహనాలు కావాలని అడగడంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపపామని తెలిపారు.

17 నుంచి మినుములు, శనగల కొనుగోలు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం ఈ నెల 17వ తేదీ నుంచి అన్ని మండల కేంద్రాల్లో మినుములు, శనగల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ హరినాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం 2024-25లో 9673 మెట్రిక్ టన్నుల శనగలు, 7074 మెట్రిక్ టన్నుల మినుములను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం టార్గెట్ విధించిందన్నారు. క్వింటం శనగలకు రూ.5650, క్వింటం మినుములకు రూ.7400 ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేస్తామన్నారు. రైతులు వారి పేర్లను వెంటనే సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు.

పాలిసెట్ - 2025
నోటిఫికేషన్ విడుదల

- వచ్చే నెల 15 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 30న ప్రవేశ పరీక్ష

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ - 2025 నోటిఫికేషన్ విడుదలైంది. 2025-26 విద్యాసంవత్సరానికి గాను పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి డైరెక్టర్ గణేశ్‌కుమార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. పాలిటెక్నిక్‌లో వివిధ డిప్లొమా కోర్సులలో ఈ నెల 12వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి విద్యార్థులకు అవకాశం కల్పిం చారు. ఎస్సెస్సీ తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన, పరీక్షకు హాజరు కాబోతున్న విద్యార్థులు పాలిసెట్‌కు అర్హులు. ఏప్రిల్ 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 30వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఓసీ, బీసీలకు దరఖాస్తు ఫారం రూ.400గా, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.100గా నిర్ణయించారు. 120 మార్కులకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని, అందులో గణితం 50, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులుగా ప్రశ్న పత్రం ఉంటుంది.

నేడు సీఎస్ విజయానంద్ రాక

నంద్యాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ శనివారం నంద్యాలకు రానున్నారు. నగరంలోని ఎస్‌బీఐ కాలనీలో ప్రతి నెలలో మూడో శనివారం నిర్వహించే 'స్వచ్ఛఆంధ్ర- స్వచ్ఛ దివస్' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా గోశాల నుంచి చెరువు కట్ట వరకు నిర్వహించే ర్యాలీలో పాల్గొంటారు. అదేవిధంగా ఇటీవల ప్రభుత్వం జిల్లాకు స్పెషల్ ఆఫీసర్‌గా నియమించిన ఐఏఎస్ అధికారి జె.నివాస్ కూడా ఈ కార్యక్రమంలో హాజరుకానున్నారు. ఇదిలా ఉండగా చీఫ్ సెక్రటరీ విజయానంద్ అహోబిలంలో జరిగే ఉత్సవాల్లో పాల్గొనే అవకాశం ఉంది.

విచారణ సజావుగా సాగేనా?

- పుర పాలకంలో అక్రమాలపై పలు ఆరోపణలు
- విచారణ అధికారిగా ప్రదీప్ కుమార్



నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో జరిగిన అక్రమాలపై విచారణ సక్రమంగా జరిగేనా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ప్రధాన ఆదాయ వనరుల్లో పట్టణ ప్రణాళిక విభాగం ఒకటి. పట్టణంలో ఓపెన్ స్పేస్ ఆదాయానికి గండి కొట్టడం, పలు అనధికారిక నిర్మాణాలకు అనుమతులు వంటి ఆరోపణలపై అప్పటి కమిషనర్ పుల్లారెడ్డితో పాటు మరో 15 మందిని విచారించేందుకు కర్నూలు సిటీ ప్లానర్ పి. ప్రదీప్ కుమార్‌ను విచారణ అధికారిగా నియమించారు.

భ్రష్టు పట్టిన పట్టణ ప్రణాళిక వ్యవస్థ

అవినీతి పునాదుల మీద రాజకీయ సౌధాలను నిర్మించుకున్న రాజకీయ అక్రమార్కులు, దళారులు, అధికారులు పట్టణ ప్రణాళిక వ్యవస్థను పూర్తి స్థాయిలో భ్రష్టు పట్టించారు. నగరంలో ఖరీదైన ప్రాంతాలైన పద్మావతి నగర్, సంజీవనగర్, ఎన్జీఓస్ కాలనీ, ఎస్‌బీఐ కాలనీతోపాటు పాత పట్టణంలోని పలు వార్డుల్లో సైతం రాజకీయ అక్రమా ర్కులు, అధికారులు, దళారులు కుమ్మక్కై పట్టణ ప్రణాళికను నిర్వీర్యం చేయటంతో పాటు మున్సిపల్ ఆదాయానికి పెద్ద ఎత్తున గండికొడుతున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో మున్సిపల్ కమిషర్ సీహెచ్ పుల్లా రెడ్డితోపాటు, వీఎస్‌ఎం నరసింహ మూర్తి, (ఏసీపీ), జి. రామకృష్ణుడు (మాజీ ఏసీపీ), మాజీ టీపీఓ ఎస్. రంగస్వామి, మాజీ టీపీఎస్ డి.రాణెమ్మ, శివుడు నాయక్, టీపీఎస్, మాజీ టీపీఎస్ ఎ. బాల మద్దయ్య, మాజీ టీపీబీవో ఎస్. రిజ్వానా, డబ్ల్యూపీఆర్‌ఎస్‌లు వి. సిద్ధార్థ, ఎ. శేఖర్, ఎస్.సాయిరంగ మనోజ్, జి.భరత్‌కుమార్, పి.రామలక్ష్మి, వి. కళ్యాణి, బి. సంధ్యారాణి, కె.మధుసూదన్ రెడ్డి ఉన్నారు. కాగా అవినీతి తిమింగలాల అంతు తేల్చే క్రమంలో కర్నూలు సిటీ ప్లానర్ పి. ప్రదీప్ కుమార్ నిజాయితీ వైపు మొగ్గుతారా.. ఒత్తిడికి తలొగ్గుతారో చూడాలి.

ఏటీఎస్‌ను తనిఖీ చేసిన రవాణాశాఖ కార్యదర్శి



ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న రవాణా శాఖ కార్యదర్శి కాంతిలాల్‌దండే

నంద్యాల క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వహిస్తున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్)ను రాష్ట్ర రవాణా శాఖ కార్యదర్శి కాంతిలాల్‌దండే శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏటీఎస్ సెంటర్‌లోని పరికరాలను, వాటి పనితీరును ఆయన పరిశీలించారు. అనంతరం టెస్టింగ్ స్టేషన్ ఆపరేటర్ ఎం.విరు పాక్షిరెడ్డి, నాగార్జునరెడ్డి ఆటోమేటెడ్ టెస్టింగ్ విధానాన్ని కాంతిలాల్ దండేకు విశ్లేషణాత్మకంగా వివరించారు. వాహన ఫిట్‌నెస్ పరీక్షలు ఆటోమేటెడ్ సిస్టం ద్వారా ఎలా నిర్వహిస్తారన్నది ప్రయోగాత్మకంగా చేసి చూపారు. పరీక్ష ప్రక్రియలో పారదర్శకతను ఎలా నిర్ధారిస్తారు, టెస్టింగ్ సమయంలో వేగం, బ్రేకింగ్, ఎమిషన్, స్టీరింగ్, సస్పెన్షన్ తదితర అంశాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా విశ్లేషించవచ్చో కార్యదర్శికి డెమో ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా రవాణా శాఖ అధికారి వై.ఐశ్వర్యారెడ్డి, ఎంవీఐ తిమ్మరుసునా యుడు, స్థానిక ప్రాంతీయ రవాణా అధికారులు, ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ సిబ్బంది పాల్గొ న్నారు. కాగా రాష్ట్ర రవాణా శాఖ కార్యదర్శి కాంతిలాల్‌దండేను కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్ కలిశారు.

అభివృద్ధికి బాటలు

- రూ.27.60 కోట్లతో రోడ్ల పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు
- గ్రామీణాభివృద్ధికి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది. కొన్నేళ్లుగా ఇబ్బంది పడుతున్న గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. రహదారుల పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో 19 రహదారులకు రూ.27.60 కోట్లతో రహదారుల పునర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి రూ.3 కోట్లు, మంత్రులు ఉన్న నియోజకవర్గాలకు రూ.6 కోట్లతో రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. గ్రామీణ రహదారులు మండల కేంద్రాలకు అనుసంధానం చేసేలా రహదారులను నిర్మిస్తూ బృహత్ కార్యానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.



రూ.కోటితో నిర్మించనున్న పోలూరు నుంచి రాయమాల్పురం వెళ్లే రహదారి

ప్రతిపాదనలు ఇలా...

1. నంద్యాల నియోజకవర్గంలో రూ. కోటితో పోలూరు నుంచి రాయమాల్పురం వరకు..
2. జాతీయ రహదారి నుంచి చాబోలు టెక్కె మీదుగా సాంబవరానికి రూ.కోటితో ప్రతిపాదనలు పంపారు
3. కానాల నుంచి మిట్నాల వరకు రూ.కోటిన్నరతో రహదారి నిర్మాణం
4. గోస్పాడు మండలం గోస్పాడు నుంచి జిల్లెల్ల మీదుగా కామినేనిపల్లె వరకు రూ. మూడు కోట్లు
5. శ్రీశైలం నియోజకవర్గంలో వెలుగోడు మండలం రేగడగూడూరు నుంచి కొత్రపోలూరు మండల సరిహద్దు వరకు రూ.1.95 కోట్లు
6. వెలుగోడు మండలం అబ్దుల్లాపురం గుంతకందాల రోడ్డు నుంచి వేల్పనూరు రోడ్డు వరకు రూ.60 లక్షలు
7. మహానంది మండలం జాతీయ రహదారి నుంచి మసీదుపురం వరకు రూ.90 లక్షలు
8. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో బాచేపల్లి నుంచి సుగాలితండా మీదుగా అహోబిలం వరకు రూ.2.85 కోట్లు
9. నందికొట్కూరు నియోజకవర్గంలో రూ.2 కోట్లతో కొత్తపల్లె మండలం ఆత్మకూరు నుంచి దుద్యాల మాడుగుల మీదుగా కొక్కెరంచ వరకు
10. పాములపాడు మండలం తుమ్మలూరుకు రూ.34.50 లక్షలు
11. నందికొట్కూరు మండలం నందికొట్కూరు నుంచి ముచ్చుమర్రి నాగటూరు రింగ్ రోడ్ మీదుగా రూ.45లక్షలు
12. పాములపాడు మండలం వేంపెంట మీదుగా రూ.35 లక్షలు
13. బనగానపల్లె నియోజకవర్గంలో బనగానపల్లె నుంచి తాడిపత్రి రహదారి రూ.2 కోట్లు
14. సంజామల మండలం వసంతాపురం నుంచి హోత్రమాన్‌దిన్నె వరకు బీటీ రోడ్డుకు రూ.కోటి
15. సంజామల మండలం గిద్దలూరు నుంచి కొమ్మవారిపల్లెకు రూ.1.80 కోట్లతో బీటీ రోడ్డు
16. సంజామల మండలం కమలపూరి నుంచి హోత్రమాన్‌దిన్నెకు రూ.90 లక్షలతో బీటీ రోడ్డు
17. బనగానపల్లె మండలం కటికవానికుంట నుంచి మద్దిలేటి స్వామి ఆలయానికి రూ.కోటితో బీటీ రోడ్డు
18. పాణ్యం నియోజకవర్గంలో గడివేముల మండలం గడివేముల నుంచి రేగడగూడూరు కొత్రపోలూరు మీదుగా రూ.2.60 కోట్లతో రోడ్ల పునర్నిర్మాణం
19. డోన్ నియోజకవర్గంలో మామిళ్లపల్లె మీదుగా డీఆర్ రోడ్ నుంచి తొండపాడుకు రూ.2.30 కోట్లు.



రూ.కోటితో చాబోలు టెక్కె మీదుగా సాంబవరానికి నిర్మించనున్న రహదారి

మగవలు



- కోరికలు తీరాలంటే కొంగు కట్టాల్సిందే..
- సంతెకుడ్లూరులో వింత ఆచారం

హోలీ పండుగ వచ్చిందంటే చాలు యువత నుంచి వృద్ధుల వరకు సంబరాలే సంబరాలు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని ఆనందంగా గడుపుతారు. కర్నూలు జిల్లా ఆదోని మండలం సంతెకుడ్లూరు గ్రామంలో మాత్రం హోలీ పండగను పురస్కరించుకొని మగవారు మహారాణుల్లా దర్శనమిస్తారు. కోరిన కోరికలు తీరాలంటే గ్రామంలో వెలసిన రతీమన్మథులను స్త్రీ వేషధారణతో మగవారు దర్శించుకోవాల్సిందే. రెండు రోజుల పాటు గ్రామంలో రతీ మన్మథుల రథోత్సవం, కామ దహనం శవయాత్ర ఉంటాయి. మగవారి మగువల వేషధారణతో గ్రామంలో శుక్రవారం పండుగ వాతావరణం నెలకొంది.



మగువల వేషధారణలో బయల్దేరిన మగవారు

ఆదోని రూరల్/ఆదోని మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని బసవేశ్వరస్వామి దేవాలయంలో ఓ గదిలో రతీమన్మథులను ఉంచుతారు. ఏడాదిలోని 365 రోజుల్లో ఒక్క ఐదు రోజులు మాత్రమే రతీమన్మథులను పాల్గుణ శుద్ధ దశమికి ఐదు రోజుల ముందు దేవాలయం బయట ఉంచి పూజలు నిర్వహిస్తారు. హోలీ పౌర్ణమి రోజు, ఆ మరుసటి రోజు రతీమన్మథులు విశేష పూజలందుకుంటారు. తదనంతరం పూజార్లు, గ్రామ పెద్దలు యథావిధిగా రతీమన్మథులను దేవాలయం గదిలో భద్రపరుస్తారు. ఈ ఐదు రోజులపాటు కోరిన కోర్కెలు తీరిన మగవారు కోర్కెలు కోరే మగవారు స్వామివార్లను మహిళలకు ఏమాత్రం తీసిపోని విధంగా మగువ రూపంలో దర్శనం చేసుకుంటారు.



పూజలందుకుంటున్న రతీమన్మథులు

ప్రత్యేక పూజలు : గ్రామంలోని బసవేశ్వర స్వామి దేవాలయంలో వెలసిన రతీమన్మథులను హోలీ పండుగ సందర్భంగా వివిధ పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. దేవాలయాన్ని విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. శుక్ర, శనివారాలు రెండు రోజులపాటు స్వామివార్లను భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకుంటారు. రతీమన్మథుల దర్శనం నిమిత్తం కోరిక తీర్చే క్రమంలో బాలుడు అయితే గౌను ధరిస్తారు. యువకులైతే పంజాబీ డ్రస్ వేసుకుంటారు. అదే మగ పెద్దలు అచ్చం మగువలా అంచు పట్టుచీర కట్టుకొని బంగారు ఆభరణాలు గొంతు నిండా ధరించి నడుంకు వడ్డానం కట్టుకొని, నెత్తిన పూలు పెట్టుకొని... నుదుట బొట్టు పెట్టుకొని చేతులకు గాజులు వేసుకొని... కాళ్లకు పారాణి రాసుకొని, కంటికి కళ్లజోడు ధరించి కుటుంబ సభ్యులతో కలిసి రతీమన్మథులను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక్కడ వారి ప్రజలకు షరా మామూలే అనిపించినా... కొత్తవారికి మాత్రం ఇది వింతనే.



మగువ రూపంలో అన్న మహేష్‌ను అలంకరిస్తున్న చెల్లెలు

నాకు ఉద్యోగం రావాలని అమ్మ మొక్కుకుంది



నా చిన్న తనంలో మా అమ్మ నాకు ప్రభుత్వ ఉద్యోగం వస్తే నాకు 11 సంవత్సరాలపాటు చీర కట్టి దర్శించుకుంటాడని రతీమన్మథులను కోరుకుంది. మా అమ్మ కోరిక మేరకే నాకు ఆస్పరి ఏపీజీబీలో పది సంవత్సరాల క్రితం ఉద్యోగం వచ్చింది. అప్పటి నుంచి నేను ప్రతి ఏడాది హోలీ రోజున రతీమన్మథులకు చీరకట్టి దర్శించుకుంటున్నా.

- ఉదయ్ కుమార్, ఆస్పరి ఏపీజీబీ ఉద్యోగి, సంతేకుడ్లూరు

పుట్టుకతోనే అంధుడను..



నేను పుట్టుకతోనే అంధుడను. నా కొడుకు ప్రయోజకుడైతే చీరకట్టి మిమ్మల్ని దర్శించుకుంటాడని రతీమన్మథులను మా అమ్మ, నాన్న మొక్కుకున్నారు. నాకు రెండు కళ్లు కనిపించకున్నా కర్ణాటక రాష్ట్రం గదక్‌లోని వీరేశ్వర పుణ్య ఆశ్రమంలో నేను హార్మోనిస్టుగా ఎంతో మందికి విద్యను నేర్పిస్తున్నాను. నేను అంధుడనైనా నాకు ఈ అవకాశం దక్కినందుకు రతీమన్మథులకు ప్రతి ఏడాది చీరకట్టి దర్శించుకుంటున్నా. ఇప్పటికే 20 సంవత్సరాలుగా ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్నారు.

-వీరభద్రప్ప, హార్మోనిస్టు, సంతేకుడ్లూరు

జీడీపీకి నిలిచిన హంద్రీ నీవా నీరు

- ప్రాజెక్టులో ఇక 1.7 టీఎంసీలే
- రోజుకు 50 క్యూసెక్కుల నుంచి 80 క్యూసెక్కుల వరకు ఆవిరి
- సాగు, తాగు నీరు పొదుపుగా వాడాలి

గోనెగండ్ల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టుకు హంద్రీనీవా నుంచి విడుదలయ్యే నీరు వారం రోజులుగా నిలిచిపోయింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 1.7 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. హంద్రీ నీవా నుంచి ప్రాజెక్టుకు నాలుగు నెలలుగా రోజకు 100 నుంచి 120 క్యూసెక్కుల వరకు నీరు విడుదలయ్యేది. అయితే ఎండాకాలం కారణంగా శ్రీశైలం బ్యాక్ వాటర్ తగ్గిపోవడంతో హంద్రీ నీవాకు నీటి విడుదల నిలిచిపోయింది. ప్రాజెక్టు కింద 13,000 ఎకరాల ఆయకట్టును రైతులు సాగు చేసుకున్నారు. ప్రతి రోజూ సాగుకు కుడి, ఎడమ కాలువల ద్వారా 100 నుంచి 120 క్యూసెక్కుల నీటిని పంటల సాగుకు విడుదల చేస్తున్నారు. అయితే ఈ ఏడాది మార్చి నెల చివరి వరకు నీరు విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఈ మేరకు జీడీపీ అధికారులు కుడి కాలువ నుంచి ఎడమ కాలువ నుంచి అవసరమైన మేరకు నీటిని విడుదల చేస్తున్నారు. అనవసరమైన సమయంలో రెండు కాలువలకు నీటిని నిలిపివేసి మరో వారం రోజుల తరువాత పంటలకు విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. వేసవిలో ఎండలు మండిపోతుండటంతో రోజుకు 50 క్యూసెక్కుల నుంచి 80 క్యూసెక్కుల వరకు నీరు ఆవిరైపోతోంది. ప్రాజెక్టు కింద డోన్, క్రిష్టగిరి, బండగట్టు తాగునీటి పథకాలకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇక హంద్రీనీవా నీరు నిలిచిపోవడంతో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



వాహ్.. దహి వడ..!

- రంజాన్ వేళ నోరూరించే వంటకం
- ప్రత్యేకంగా విక్రయ కేంద్రాల ఏర్పాటు
- పాత నగరంలో జోరుగా అమ్మకాలు

కర్నూలు కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో రోజా (ఉపవాసం) పాటిస్తున్న ముస్లింలు సాయంకాల వేళ 'ఇఫ్తార్' (రోజా విరమణ) సమయంలో అల్పాహారంగా స్వీకరిస్తారు. వివిధ రకాల పండ్లు, తేలికగా జీర్ణమయ్యే తినుబండారాలపై ఆసక్తి చూపిస్తారు. అలాంటి వాటిలో 'దహి వడ' (పెరుగు వడ)కు ఒక ప్రత్యేకత ఉంది. సులువుగా జీర్ణం కావడంతో పాటు, పన్నెండు గంటల పాటు ఆహారం లేకుండా ఉన్న వారి శరీరాలకు వెంటనే సాంత్వన చేకూర్చే గుణం ఉన్న ఈ దహి వడలు రంజాన్ మాసంలో పాతనగరంలో అమ్మకాలకు పెట్టింది పేరు. ఈ మాసంలో తయారు చేసి అమ్మకాలు చేసే ఈ ప్రత్యేక రుచుల 'దహివడ', 'సమోసాలు' వంటివి ముస్లింలతో పాటు ఇతరులను కూడా ఎంతో ఇష్టంగా తింటారు. పాతనగరంలో వీటి తయారీలు, అమ్మకాలు ఇటీవల జోరందుకున్నాయి. రంజాన్ మాసంలో నెలరోజుల పాటు పాతనగరంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 30పైగా విక్రయకేంద్రాలు వెలిసి వీటిని అమ్మకాలు చేస్తున్నాయి. వేడివేడిగా తయారయ్యే ఈ దహి వడ, సమోసాలు రోజా ఇఫ్తార్ సమయానికి ఒక గంట ముందుగా అమ్మకాలు ప్రారంభిస్తారు. అయితే కేవలం ఒక గంటలోపే మొత్తం అమ్మకాలు జరిగిపోతాయి. తిరిగి వీటిని కొనుగోలు చేయాలంటే మళ్లీ ఒకరోజు వరకు ఆగాల్సిందే.

తయారీ కూడా ప్రత్యేకమే...

వ్యాపారులు ఒకరోజు ముందే మినపపప్పు నానబెట్టి, మెత్తగా గ్రైండింగ్ చేసి, మేలురకం నూనెలో దోరగా వేయిస్తారు. తర్వాత వీటిని వెడల్పాటి గిన్నెలో చిక్కటి పాలతో తయారైన పెరుగులో రెండు గంటల పాటు నానబెడతారు. జీలకర్ర, ఇతర మసాల దినుసులతో పోపు పెట్టిన పెరుగును పీల్చుకున్న వడలపై చిన్నగా తురిమి సిద్ధం చేసుకొన్న కొత్తిమీర, క్యారెట్, అల్లం మిశ్రమాన్ని చేర్చి అందిస్తారు. చూడగానే నోరూరించే దహి వడలు జత రూ.50లాగా విక్రయిస్తారు. పాతనగరంలో పెద్దమార్కెట్, పూలబజార్, గడియారం ఆసుపత్రి, మించిన్‌బజార్, మెయిన్ బజార్ తదితర ప్రాంతాల్లో దహి వడ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వీటితో పాటు మేలురకం గోధుమ పిండితో తయారు చేసిన సమోసాలను కూడా ఆసక్తిగా కొనుగోలు చేస్తారు. ఆలూకుర్మాతో తయారైనవి కొన్ని కాగా, క్యారట్, బీట్‌రూట్‌లతోపాటూ విజిటెబుల్స్‌తో తయారైన సమోసాలు, కేవలం ఆనియన్ తురుము, మసాలతో తయారైన సమోసాలు వేటికవే ప్రత్యేకంగా నిలుస్తాయి.



కర్నూలుకు పరిచయం చేసింది మేమే



పాతనగరంలో మా పూర్వీకుల కాలం నుంచి స్వీట్ స్టాల్ నిర్వహిస్తున్నాం. సుమారు 70 ఏళ్ల క్రితమే మా తండ్రి జలీల్ అహ్మద్ హైదరాబాదులో దహి వడ తయారు చేయడం నేర్చుకుని వచ్చి ఆయన రంజాన్ మాసంలో వీటిని అమ్మడం ప్రారంభించారు. అలా వీటిని తొలుత అమ్మకాలు ప్రారంభించింది మేమే. అప్పటి నుంచీ మాకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. మా తండ్రి వారసత్వంగా మేమూ రంజాన్ మాసంలో దహి వడ, వివిధ రకాలతో సమోసాలు తయారు చేసి అమ్ముతుంటాం. మావద్ద వీటిని తయారు చేయడం నేర్చుకున్న చాలా మంది నగరంలో వివిధ చోట్ల వీటిని అమ్మకాలు చేస్తున్నారు. ముస్లింలతో పాటు హిందువులు కూడా ఇష్టంగా స్వీకరిస్తారు.

- జేకే ఆబిద్, వ్యాపారి, పూలబజార్, కర్నూలు

అవగాహనతోనే హక్కులకు రక్షణ

- వినియోగదారుల హక్కులకు బలమైన చట్టాలు
- హక్కుల ఉల్లంఘనలపై అస్త్రం సంధించాలి
- నేడు అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం

మార్కెట్ మాయాజాలంలో నిత్యం వినియోగదారులు మోసపోతూనే ఉన్నారు. వినియోగదారుల హక్కుల సంరక్షణకు బలమైన చట్టాలు ఉన్నా.. మోసాలు, అక్రమాలు ఆగడం లేదు. శనివారం అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల హక్కుల చట్టాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

కర్నూలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం వినియోగదారుల రక్షణకు 1986లో ఒక విప్లవాత్మకమైన చట్టం తీసుకొచ్చింది. వినియోగదారుల హక్కుల రక్షణ కోసం 1985 ఏప్రిల్ 9న ఐక్యరాజ్యసమితి రూపొందించిన మార్గదర్శక సూత్రాలను సభ్యదేశాలు ఆమోదించాయి. 1986లో వినియోగదారుల హక్కుల రక్షణ బిల్లును పార్లమెంట్ ఆమోదించారు. 1986 డిసెంబరు 24న రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఆనాటి నుంచి ఏటా డిసెంబరు 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం జరుపుకుంటున్నాం. వినియోగదారులు వస్తు, సేవల్లో ఏ రూపంలో మోసపోయినా కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చు. ఆన్‌లైన్ సేవలు విస్తృతం కావడంతో ఇంటి నుంచి వివిధ వస్తువులు కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ వ్యాపార లావాదేవీలను వినియోగదారుల రక్షణ చట్టం-2019 పరిధిలోకి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. కొనుగోలు చేసిన వస్తువుల్లో నాణ్యత లోపించినా, తూకాల్లో మోసాలకు పాల్పడినా, పరిహారం కోరే హక్కు ఉంది.



జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ కోర్టు



90 రోజుల్లో కేసుల పరిష్కారానికి కృషి



బాధితుల ఫిర్యాదు చేసిన 90 రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తాం. మధ్యవర్తిత్వం ద్వారా సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తున్నాం. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసిన స్వీకరించి ప్రతివాదులకు నోటీసులు పంపించి.. వినియోగదారులకు అండగా నిలుస్తాం. ఆన్‌లైన్ ద్వారా కూడా విచారణ చేసి బాధితులకు అండగా నిలుస్తున్నాం. జిల్లా వినియోగదారుల కమిషన్ ఏర్పాటు అయిన నాటి నుంచి 8,029 కేసులు నమోదు కాగా.. 8.097 కేసులు పరిష్కరించాం. ఈ ఏడాది కాలంలో 262 కేసులు పరిష్కరించాం.

- కరణం కిశోర్‌కుమార్, అధ్యక్షుడు, జిల్లా వినియోగదారుల కమిషన్, కర్నూలు

ఏ ఫిర్యాదు.. ఎక్కడ చేయాలి..!

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి మూడు స్థాయిలో కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్ (వినియోగదారుల కమిషన్) పని చేస్తుంది. జిల్లా స్థాయి ఫోరం వస్తువులు/సేవల విలువ రూ.50 లక్షలలోపు ఫిర్యాదులు పరిష్కరిస్తుంది. రూ.కోటి నుంచి రూ.2 కోట్ల మధ్య రాష్ట్ర స్థాయి, రూ.2 కోట్లకు మించిన విలువ కలిగిన ఫిర్యాదులను జాతీయ స్థాయి ఫోరం పరిష్కరిస్తుంది.

అవగాహన ఎంతో ముఖ్యం



వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలి. వస్తు, సేవల్లో మోసాలకు గురైనా పట్టించుకోవడం లేదు. అదే అక్రమార్కులకు వరంగా మారుతోంది.

- ఎన్.నారాయణరెడ్డి, జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యుడు, కర్నూలు

ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలి



వినియోగదారుల హక్కులపై చైతన్యం కల్పిస్తూ వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలి. సూచనలు, సలహాల కోసం ఉచిత కాల్ సెంటర్ నంబరు 1915/1800-11-4000 సంప్రదించవచ్చు.

- ఎస్. నజీమాకౌసర్, జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు, కర్నూలు

ఫుల్ జోష్..!





కిసాన్ ఘాట్‌లో 'హోలీ బ్లాస్ట్'

కర్నూలు కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రంగుల వేడుక 'హోలీ'ని శుక్రవారం నగర వాసులు ఘనంగా నిర్వహించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచే వేడుక సందడి కనిపించింది. చిన్నారులు, యువకులు, మహిళలు ఈ వేడుకల్లో రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా వేడుకలో పాల్గొన్నారు. పాతనగరంలో మార్వాడీలు హోలీ సంబరాల్లో మునిగితేలారు. వన్‌టౌన్ మఠం వీధి, చిత్తారి వీధి, కుమ్మరి వీధి, రాంభొట్ల దేవాలయం తదితర ప్రాంతాల్లో చిన్నారులు, మహిళలు హోలీ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అదేవిధంగా కిసాన్ ఘాట్‌లో యాన్సన్ అండ్ ఫన్అండ్‌ఫుడ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'హోలీ బ్లాస్ట్' ఈవెంట్ సంబరాలు అలరింపజేశాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ వేడుక కొనసాగింది.











సభ వద్ద నాగబాబు భార్య



సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్



మేం సైతం: సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనషోన

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.



పవన్ అభిమానం


పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..




పిఠాపురం: 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.

జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.



చిత్రాడదారులన్నీ జనపవనమై..

శరీన్ నగర్‌లో

దారుణ హత్య

- మారణాయుధాలతో దాడి చేసిన రౌడీ షీటర్ అంజి, ఆయన వర్గీయులు
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ టీడీపీ నాయకుడు సంజన్న మృతి



సంజన్న (ఫైల్)

కర్నూలు క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని శరీన్‌నగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు సంజన్న (58) శుక్రవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల వివరాల మేరకు.. సంజన్న గతంలో వైసీపీలో కాటసాని రాంభూపాల్ రెడ్డి వర్గీయుడిగా ఉన్నాడు. ఆయన భార్య లక్ష్మీదేవి కార్పొరేటర్‌గా కూడా పని చేశారు. ప్రస్తుతం ఆయన కొడుకు జయరాం కార్పొరేటర్‌గా నెగ్గారు. గత సార్వత్రిక ఎన్నికల్లో కాటసానితో విభేదాలు వచ్చి టీడీపీలో చేరారు. మొదట గౌరు వర్గంలో చేరాలనుకొని భావించి ఆ తరువాత బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి వర్గంలో చేరారు. సంజన్నకు ప్రతి రోజూ ఇంటి సమీపంలో ఉండే గుడేకల్లు మెడిటేషన్ సెంటరుకు వెళ్లే అలవాటు ఉంది. రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి కూడా 9 గంటల ప్రాంతంలో మెడిటేషన్ సెంటర్‌కు వెళ్లాడు. తిరిగి వస్తుండగా అదే శరీన్‌నగర్‌కు చెందిన అంజి, అతని వర్గీయులు కాపు కాసి మారణాయుధాలతో కిరాతకంగా దాడి చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి అంజి వర్గీయులు పరారు కాగా.. స్థానికులు సంజన్నను ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

● అంజిపై గతంలో పలు కేసులు:

సంజన్నపై దాడి చేశాడని అనుమానిస్తున్న అంజిపై గతంలో పలు కేసులు ఉన్నాయి. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఆయన అన్న కొడుకు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వర్గీయుడిగా ఉన్న అంజి సాయి ఈశ్వరుడు హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసును ఇటీవలే కోర్టు కొట్టేసింది. ఆ తర్వాత బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వర్గంలో కొనసాగుతూ వచ్చారు. ఇటీవల బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి వర్గంలో చేరినట్లుగా స్థానికులు చెబుతున్నారు. అంజి చేసిన నేరాలపై పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారు. మూడు నెలల కింద కూడా అంజికి, సంజన్నకు గొడవలు జరిగినట్లుగా స్థానికులు చెబుతున్నారు. అది మనస్సులో ఉంచుకుని అంజి ఈ దారుణానికి ఒడిగట్టి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

● పోలీసులు అప్రమత్తం:

సంజన్న హత్యతో శరీన్‌నగర్‌లో కలకలం రేగింది. రాజకీయాల్లో ఓటర్లను ప్రభావితం చేయడంలో సంజన్నకు బాగా పట్టు ఉంది. ఈ నేపథ్యంలో ఆయన వర్గీయులు పెద్ద ఎత్తున మార్చురీ వద్దకు చేరుకున్నారు. దీంతో పోలీసులు అప్రమత్తమై శరీన్‌నగర్‌లో భారీ ఎత్తున పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. నాలుగో పట్టణ పోలీసుస్టేషన్ ఎస్ఐలు చంద్రశేఖర్ రెడ్డి, గోపినాథ్‌లు సంఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ బాబు ప్రసాద్ పరిస్థితిని సమీక్షించారు. శరీన్‌నగర్‌లో ఎలాంటి అల్లర్లు జరగకుండా పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

కర్నూలు క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో నూతనంగా శ్రీకారం చుట్టిన నేను సైబర్ స్మార్ట్ కార్యక్రమంపై వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సైబర్ బారిన పడకూడదని కరపత్రాలు, లఘు చిత్రాలతో అవగాహన కల్పించారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ల పరిధిల్లో జిల్లా వ్యాప్తంగా 38 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటి వరకు 485 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 48,600 మందికి అవగాహన కల్పించారు.

రైతు స్వప్నం సాకారం

- రూ.11 కోట్లతో టమోటా ప్రాసెసింగ్ యూనిట్
- పుచ్చకాయలమాడలో సీఎం చంద్రబాబు హామీ
- నిధులతో వచ్చాం.. ఆరు నెలల్లో పూర్తి చేస్తాం
- టమోటా ప్రాసెసింగ్ యూనిట్ శంకుస్థాపనలో మంత్రి టీజీ భరత్



టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే కేఈ. శ్యాంబాబు

పత్తికొండ, మార్చి,14(ఆంధ్రజ్యోతి): పత్తికొండ ప్రాంతంలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌తో రైతు స్వప్నం సాకారం కానుందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం పత్తికొండ మండల పరిధిలోని కనకదిన్నె గ్రామం వద్ద రూ.11 కోట్లతో ఏర్పాటు చేయనున్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఎమ్మెల్యే కేఈ. శ్యాంబాబుతో కలిసి మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా టమోటా పండే పత్తికొండ ప్రాంతంలో టమోటా గిట్టుబాటు ధర లేక రైతులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. గత ఏడాది పింఛన్ల పంపిణీ కోసం పుచ్చకాయలమాడ గ్రామానికి వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు టమోటా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీని కోసం రూ.11 కోట్ల నిధులతో పత్తికొండ మండలం కనకదిన్నె వద్ద 2.5 ఎకరాల విస్తీర్ణంలో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ యూనిట్ ద్వారా రోజుకు 10 నుంచి 12 టన్నుల టమోటాను ప్రాసెసింగ్ చేసే అవకాశం ఉంటుందని, అలాగే మామిడి, అరటి, బొప్పాయి పంటల ప్రాసెసింగ్ కూడా ఈ యూనిట్ ద్వారా నిర్వహించవచ్చన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగానే కనకదిన్నె వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వర్షాధార పత్తికొండ ప్రాంతాన్ని మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. అందుబాటులో ఉన్న హంద్రీ నీవా నీటిని ఎత్తిపోతల ద్వారా గ్రామ గ్రామానికి తీసుకువచ్చి తాగునీటిని అందించేందుకు నివేదికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ అన్ని రకాలుగా వెనుకబడ్డ కర్నూలు జిల్లా పడమటి ప్రాంతంలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాషా, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ గడ్డం శేఖర్‌బాబు, పీడీ ఉమాదేవి, ఆర్డీవో భరత్ నాయక్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బొజ్జమ్మ తదితరులు ఉన్నారు.

సంస్కృత భాషలో సర్టిఫికెట్ కోర్సు



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రీయ సంస్కృత విశ్వ విద్యాలయం శిక్షణ కోఆర్డినేటర్ జి. సుబ్రహ్మణ్యం

కర్నూలు కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సంస్కృత భాషను దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఆ భాషను మరింత విస్తృత పరిచే దిశగా కేంద్రీయ సంస్కృత విశ్వ విద్యాలయం కార్యక్రమాలను రూపొందించిందని జిల్లా శిక్షణ కోఆర్డినేటర్ జి.సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం కర్నూలులో బుధవారపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. న్యూఢిల్లీలోని కేంద్రీయ సంస్కృత విశ్వ విద్యాల యం, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆ కళాశా ల్లో సంస్కృత అధ్యయన కేంద్రం ప్రారంభించామని తెలిపారు. సంస్కృత భాష అందరికీ అందాలనే ఉద్దేశ్యంతో, సంస్కృతం రాయడం, చదవడం, మాట్లాడటం వంటి అంశాల్లో మూడు నెలల సర్టిఫికెట్ కోర్సును అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఈ శిక్షణల్లో 15 ఏళ్ల పైబడి వారు ఎవరైనా చేరవచ్చని, వ్యాపారులు, గృహిణులు, ఉద్యోగులు, యువత ఈ శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జి.పుల్లారెడ్డి కళాశాలలో ప్రతిరోజూ సాయంత్రం 4-5 గంటల మధ్య శిక్షణ ఉంటుందన్నారు. అక్కడికి రాలేని వారికి నగరంలోని కేశవ మెమోరియల్ పాఠశాల్లో శనివారం సాయంత్రం 5-7 గంటల మధ్య ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల మధ్య శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు 90195 56184, 87623 94795 నంబర్లను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ విభాగం అధికారి కురిడి సురేష్, సంస్కృత భారతి జిల్లా శాఖ అధ్యక్షురాలు మహాలక్ష్మి, సంస్కృత భారత నగర అధ్యక్షులు గుబ్బా బాలస్వామి, ప్రచారకులు రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

పూజకు వేళాయె

- సప్తనదుల నుంచి బయల్పడుతున్న సంగమేశ్వరాలయం



నీటి మట్టం తగ్గినట్లయితే పూర్తిగా ఆలయం బయల్పడే అవకాశం ఉంది. నీటి విడుదల ఇలాగే కొనసాగితే రానున్న ఉగాది పర్వదినానికి సంగమేశ్వరస్వామి భక్తులకు దర్శనం ఇచ్చే అవకాశం ఉంది.

కొత్తపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు నుంచి సాగు, తాగునీటి అవసరాల కోసం అధికారులు దిగువకు నీరు విడుదల చేస్తుండటంతో సప్తనదుల్లో నిక్షిప్తమై ఉన్న సంగమేశ్వరాలయం బయల్పడుతోంది. శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం 885 అడుగులకు గాను 844.50 అడుగులుగా నమోదైంది. అలాగే రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వలు 215 టీఎంసీలకు గాను 69.1600 టీఎంసీలుగా నమోదైంది. దీంతో సంగమేశ్వరాలయ గోపురం మెలమెల్లగా బయల్పడుతూ వచ్చింది. కేవలం 5 నుంచి 6 అడుగుల మేర శ్రీశైలం ప్రాజెక్టు వద్ద

చికిత్స పొందుతూ వైద్య విద్యార్థిని మృతి

కర్నూలు హాస్పిటల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ విద్యార్థిని ఎ. రమ్య తేజ (20) చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందింది. అనంతపురం జీజీహెచ్ అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ ఎ. నవీన్ కూతురు రమ్యతేజ కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. గత నెల 14వ తేదీ రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే విద్యార్థులు కర్నూలు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. ఆ తరువాత మెరుగైన చికిత్స కోసం కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. 15 రోజుల తర్వాత కోలుకున్న డా.రమ్యతేజ కర్నూలు మెడికల్ కాలేజీలో సెకండ్ ఇయర్ ఎంబీబీఎస్ ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరైంది. ఇటీవల సెకండ్ ఇయర్ ఎంబీబీఎస్ పరీక్షల ఫలితాలు కూడా వచ్చాయి. ఇందులో డా.రమ్యతేజ మంచి మార్కులతో పాస్ అయింది. మూడో సంవత్సరంలో చేరి అంతా బాగుంది అనుకున్న సమయంలో మళ్లీ ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో సొంత ఊరైన అనంతపురంలోని కిమ్స్ సవేరా హాస్పిటల్‌లో చేర్పించారు. వెంటిలేటర్ మీద చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. డా.రమ్యతేజ మృతితో కాలేజీలో తీవ్ర విషాదం నెలకొంది. తోటి విద్యార్థులు అంత్యక్రియలకు హాజరై విచారం వ్యక్తం చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ డా.పి.చిట్టి నరసమ్మ వైస్ ప్రిన్సిపాల్ డా.సాయి సుధీర్, డా.విజయానందబాబు విద్యార్థిని మృతి పట్ల సంతాపం తెలిపారు.

సీఎంను కలిసిన మల్లెల రాజశేఖర్



ఓర్వకల్లు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును విజయవాడలోని సీఎం నివాసంలో శుక్రవారం టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కోసం రూ.14 కోట్లతో నివేదికలు అందజేశారు. అలాగే కొమ్ముచెరువులో అన్యాక్రాంతమైన భూములను స్వాధీన పరుచుకుని చెరువును మట్టిని తీసి ఎత్తు పెంచి నీటితో నింపితే.. సాగు భూములతో పాటు సోలార్ కూడా నీటిని ఉపయోగించుకోవచ్చని ఆయన చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారని మల్లెల రాజశేఖర్ తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఉనికి కోసమే వైసీపీ విమర్శలు: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు తమ ఉనికిని చాటుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై అవాక్కులు చవాక్కులు పేల్చుతున్నారని, వీటిని సహించబోమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శుక్రవారం అల్లూరు గ్రామంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ మండలిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై వైసీపీ నాయకులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెబుతూ రూ.119 కోట్లు కేటాయించారని, వాటిలో జరిగిన అవకతవకలపై విచారణ జరుగుతోందని చెప్పారన్నారు. శాప్ మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చెప్పే పిట్ట కథల లెక్కలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తేల్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. విచారణలో అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు. గుమ్మడికాయల దొంగ అంటే బుజాలు ఎందుకు తడుముకుంటారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారన్నారు. హైదరాబాదు నుంచి నేరుగా కోర్టుకు వచ్చి వెళ్లే మీకు, బెంగళూరు నుంచి విజయవాడకు వచ్చే మీ అధినేత జగన్ రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి, సంక్షేమం జరిగేది ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు వీరం ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

గడివేముల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌కే తండా గ్రామంలో హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని టీడీపీ నాయకులు విజయబాబుల్‌రెడ్డి, శిల్పా జ్యోతి 150 మంది మహిళలకు శుక్రవారం చీరలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఎంపీ బైరెడ్డి శబరి ఈ చీరలు అందజేశారని చెప్పారు. బైరెడ్డి శబరి తండా గ్రామస్థులతో వీడియోకాల్ ద్వార శుభాకాంక్షలు తెలియజేశారు. పురుషోత్తమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కాశినాయన జ్యోతి క్షేత్రాన్ని కాపాడుకోవాలి'



మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

నంద్యాల కల్చరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కాశినాయన జ్యోతి క్షేత్రం కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాల వీహెచ్‌పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 7వ తేదీన జ్యోతి క్షేత్రంలో ప్రభుత్వ నిధులతో నిర్మాణం చేసిన శౌచాలయాలను అటవీశాఖ అధికారులు కూల్చివేశారన్నారు. అయితే ఈ సందర్భంగా నెలకొన్న ఆందోళనకర పరిస్థితులకు క్షమాపణ కోరుతూ ఆ నిర్మాణాలను తన సొంత నిధులతో పునర్మిస్తామని మంత్రి లోకేశ్ సోషల్ మీడియా ద్వారా పంచుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ పోలేపల్లి సందీప్, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, శేషసాయి, నాగరాజు, విశ్వనాథరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కారల్ మార్క్స్‌కు నివాళి

నందికొట్కూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కారల్ మార్క్స్ 142వ వర్ధంతి సందర్భంగా సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో నందికొట్కూరులోని జై కిసాన్ పార్కులో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. సీపీఐ జిల్లా నాయకడు రఘురామమూర్తి, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రపంచ మానవాళి సమస్యలకు ఒక శాస్త్రీయమైన పరిష్కారాన్ని చూపిన మహనీయుడు కారల్ మార్క్స్ అని కొనియాడారు. ఏపీ మహిళా సంఘం నాయకురాలు రజిత, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

నంద్యాల క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులను సీనియర్ న్యాయవాది, నంద్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావినూతల దుర్గా ప్రసాద్ శుక్రవారం పంపిణీ చేశారు. దుర్గా ప్రసాద్ బావ హనుమంతరావు జ్ఞాపకార్థం 20 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం తన కార్యాలయంలో చేశారు. అడ్వకేట్ రావినూతల విశ్వనాథ్, రాయలసీమ వికలాంగుల సేవా సమితి అధ్యక్షుడు, న్యాయవాది బాలసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, చంద్రయ్యగౌడ్, సిద్దయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'ఆధునిక దోబీ ఘాట్ల నిర్మాణానికి కృషి'



మాట్లాడుతున్న రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి

నంద్యాల నూనెపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఆధునిక దోబీ ఘాట్ల నిర్మాణానికి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని, అందుకు సంబంధించి స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి తెలిపారు. శుక్రవారం నంద్యాలలోని ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన ఆమె ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నంద్యాల జిల్లా కేంద్రంలో రజక వర్గానికి సంబంధించిన 7వేల మంది యువత విద్యావంతులుగా ఉన్నారని, వారికి మోడ్రన్ దోబీ ఘాట్లను నిర్మించి ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రజకుల సమస్యలను పరిష్కరించేలా రజక మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంస్థల్లో దోబీకి సంబంధించిన ఉద్యోగాలను రజకులకే కేటాయించేవిధంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. వైద్య, ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు భర్తీచేసేందుకు వైద్యశాఖ మంత్రికి ఇటీవలే వినతిపత్రం అందజేశామని చెప్పారు.

ఘనంగా హోలీ



నంద్యాలలో హోలికా దహనం



నంద్యాలలో హోలీ వేడుకల్లో పాల్గొన్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల కల్చరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నంద్యాల రంగరాజు వీధిలోని రుక్మిణీ పాండురంగస్వామి దేవస్థానం ప్రాంగణంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి హోలికాదహనం నిర్వహించి శుక్రవారం ఉదయం హోలీ పండుగ నిర్వహించుకున్నారు. భావసారక్షత్రియులు, భక్తులు పాల్గొన్నారు.

నంద్యాల మున్సిపాలిటీ: భారతీయ సమాజంలో విభిన్న వర్గాల సమ్మేళనానికి ప్రతీక అయిన హోలీ సమైక్యతకు దర్పణం పడుతోందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. పట్టణంతో పాటు పలు ఇతర ప్రాంతాల్లో జరిగిన హోలీ వేడుకల్లో ఫిరోజ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: హోలిసంబరాల్లో భాగంగా కామదహన కార్యక్రమాన్ని గురువారం అర్ధరాత్రి ఆత్మకూరు పట్టణంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. యువకులు వరిగడ్డితో మన్మథ రూపంలో తయారు చేసిన కామదేవున్ని ఊరేగింపు నిర్వహించి దహనం చేశారు.

ఆత్మకూరు రూరల్: మండలంలోని సంజీవ్‌నగర్ తండా, ముష్టపల్లి, నల్లకాలువ తదితర గ్రామాల్లో హోలి పర్వదినాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నారులు, మహిళలు, పెద్దలు రంగులు చల్లుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ప్రత్యేకించి ఆయా గ్రామాల ప్రజలు బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. సుగాలి మహిళలు సంప్రదాయ వేషధారణతో పాటలు పాడుతూ ఆనందంగా గడిపారు.

వెలుగోడు: వెలుగోడులో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజలు రంగులు చల్లుకున్నారు. డ్యాన్స్ వేసి ఆనందంగా గడిపారు.



వెలుగోడులో డ్యాన్స్



ఆత్మకూరు రూరల్: ముష్టపల్లిలో రంగులు చల్లుకున్న ప్రజలు



ఆత్మకూరులో..

నెరవాటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం



ఇన్‌ఫెర్టిలిటీ విభాగాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ పోచా



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్ రెడ్డి

నంద్యాల హాస్పిటల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణం పద్మావతినగర్‌లో నూతనంగా నిర్మించిన నెరవాటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని శుక్రవారం నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా పట్టణంలోని గాంధీచౌక్‌లో నెరవాటి ఆసుపత్రిలో చెవి, ముక్కు, గొంతు వైద్యులు నెరవాటి వినోద్‌కుమార్, సంతాన సాఫల్య చికిత్సా నిపుణులు డాక్టర్ అరుణకుమారి వైద్య సేవలు అభినందనీయమన్నారు. డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ అరుణకుమారి మాట్లాడుతూ అవుట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్, డిజిటల్ ఎక్స్‌రే, హార్మోన్ ల్యాబ్, అడ్వాన్స్‌డ్ మాడ్యులర్ థియేటర్ అందుబాటులో ఉన్నాయన్నారు. చెవి, ముక్కు, గొంతు వైద్యంతో పాటు సంతానం లేని వారికి ఇన్‌ఫెర్టిలిటీ, ఆర్థోపెడిక్, గైనిక్ విభాగాలను ఏర్పాటు చేశామని చెప్పారు. త్వరలోనే ఐసీయూ విభాగాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు ఆసుపత్రి ప్రారంభం సందర్భంగా ఉచిత ఓపీ సేవలను అందిస్తామన్నారు. గైనిక్ విభాగంలో డాక్టర్ ఫాతిమాబీ, ఆర్థోపెడిక్ విభాగంలో డాక్టర్ సుమన్‌కుమార్ వైద్యసేవలు అందిస్తారని, నంద్యాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్యం పట్టివేత

ఆత్మకూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో గురువారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూరు అర్బన్ సీఐ రాము తెలిపిన వివరాలివీ.. ఆత్మకూరు మండలంలోని నల్లకాల్వ గ్రామానికి చెందిన రామిరెడ్డి తమ బంధువుల వివాహం నిమిత్తం ఆత్మకూరు పట్టణంలోని పలు మద్యం దుకాణాల నుంచి భారీ స్థాయిలో మద్యాన్ని కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తున్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. దీంతో తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని చెప్పారు. సుమారు 144క్వార్టర్లు, 6 ఫుల్ బాటిళ్లు, 9 ఆఫ్ బాటిళ్ల 24 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే మద్యం రవాణాకు వినియోగించిన ఆటోను సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ అలాగే పట్టుబడిన రామిరెడ్డి, ఆటో డ్రైవర్ మధుకుమార్‌పై కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

రేపు చెక్కుల పంపిణీ

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం సీఎం రిలీఫ్ చెక్కుల పంపిణీ చేయనున్నట్లు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరగనున్న చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, నాయకులు హాజరు కావాలని కోరారు.

అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడికి సత్కారం



అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడిని సత్కరిస్తున్న ప్రతినిధులు

ఆత్మకూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ తరుపున శుక్రవారం అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు తులసీరెడ్డిని ఘనంగా సత్కరించారు. శ్రీశైల మల్లన్న దర్శనార్థం చిత్తూరు నుంచి ఆత్మకూరు మీదుగా శ్రీశైలానికి వెళ్తున్న ఆయన ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్‌ను సందర్శించారు. స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పసీల్ మున్నా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం తులసీరెడ్డి మాట్లాడుతూ.. ఆత్మకూరు ప్రాంతంలో ఎన్‌టీఆర్ కేవీకే స్టేడియం ద్వారా వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్, బాల్ బాడ్మింటన్, తైక్వాండో, బాక్సింగ్ తదితర క్రీడలపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధులు ఆసీఫ్‌బేగ్, నాయబ్ సయ్యద్, అసదుల్లా, బాబు, ముర్తుజావలి, మహెబూబ్ తదితరులు ఉన్నారు.

ఓపికకు పరీక్ష

- ప్రభుత్వ వైద్యశాలలో గంటల తరబడి నిరీక్షణ
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు



యాప్‌లో నమోదు కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఓపీ కోసం పిల్లలతో నిరీక్షిస్తున్న మహిళలు

నంద్యాల హాస్పిటల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆసుపత్రిలో ఓపీ కోసం రోగులు, బాలింతలు అవస్థలు పడుతున్నారు. మొబైల్ యాప్‌లో నమోదు చేసుకున్న తర్వాత టోకెన్ నంబర్ ఇస్తున్నారు. అనంతరం కౌంటర్ వద్ద ఓపీ జారీ చేస్తున్నారు. ఏబీహెచ్ఏ ద్వారా ఈ ఓపీ టిక్కెట్ జారీ నూతన భవనం నిర్మించినప్పటి నుంచి నిర్వహిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ ఉన్న వారికి సులువుగానే చేస్తున్నప్పటికీ చిన్న సెల్‌ఫోన్‌లతో ఇబ్బందులు పడుతున్నారు. ఓపీ కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సిగ్నల్స్ లేకపోతే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. సిబ్బంది సైతం నిస్సహాస్థితిలో ఉండాల్సివస్తోంది. రోగులు ఆసుపత్రికి వచ్చి ఓపి టిక్కెట్ కోసం క్యూలో ఉండడమే గాక టిక్కెట్ తీసుకున్న తర్వాత కౌంటర్‌వద్ద కూడా రద్దీ ఎక్కువగా ఉండడంతో క్యూలో నిల్చోక తప్పడం లేదు. బాలింతల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. చంటిబిడ్డలను ఎత్తుకుని ఓపీ కోసం నానా అవస్థలు పడాల్సివస్తోంది. బాలింతల కోసం ప్రత్యేకంగా ఎంసీహెచ్ వార్డులో ఓపీ ఇవ్వాలని కోరుతున్నారు.

మహానందిలో పౌర్ణమి వెలుగులు



ధాన్య శివుడు, కామేశ్వరీదేవి, రాతి నంది విగ్రహాలపై కనువిందు చేస్తున్న చంద్రుడు

మహానంది, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఈ సంవత్సరపు చివరి పున్నమి చంద్రుడు(హోలి పౌర్ణమి) వెలుగులు శుక్రవారం తెల్లవారుజామున పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలతో పాటు రాతి నంది విగ్రహంపై చంద్రుడు వెలుగులు పంచాడు. ఈ అపురూప దృశ్యాలను తిలకించిన భక్తులు తమ సెల్‌ఫోన్‌ల్లో చిత్రీకరించారు. ఆలయ ప్రాంగణంలోని ధాన్య శివుని శిరస్సు పైభాగంలో, కామేశ్వరీదేవి అమ్మవారి శిఖా భరణంపైన, ఆలయం ప్రధాన కూడలిలోని రాతి నందీశ్వరుని విగ్రహంపై చంద్రుడు నిలబడి మహానందీశ్వరుని దర్శనం చేసుకున్న అద్భుత సుందర సమధుర దృశ్య మాలిక అలరించింది.

భ్రమరాంబికాదేవికి కొబ్బరికాయల సమర్పణ



కొబ్బరికాయ సమర్పిస్తున్న ఈవో

శ్రీశైలం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం గానీ, శుక్రవారం గానీ భ్రమరాంబ అమ్మవారికి కుంభోత్సవం జరిపించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఏప్రిల్ 15న కుంభోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారికి సాత్విక బలి నిర్వహించేందుకు కుంభోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఆ రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాదికాలు నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు. ఈవో ఎం. శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

- శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకళ్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ ఘనంగా నిర్వహించారు. గ్రామదేవత అంకాలమ్మకు విశేష పూజలు నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన రాధిక డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.
- శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం కర్నూలు జిల్లాకు చెందిన కె. సురేష్ అనే భక్తుడు రూ.1,00,116 విరాళాన్ని ఏఈవో జి. స్వాములుకు అందజేశారు. హైదరాబాదుకు చెందిన పర్వతవర్ధనమ్మ ఆంజనేయులు అనే భక్తుడు రూ.1,25,000 విరాళాన్ని పర్యవేక్షకుడు ఎం. మల్లికార్జునకు అందజేశారు.

వైభవంగా పూర్ణాహుతి

నంద్యాల కల్చరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నంద్యాల హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన అమ్మ స్ఫటిక లింగేశ్వరాలయంలో శుక్రవారం పాల్గుణమాస పౌర్ణమి సందర్భంగా, పౌర్ణమి హోలీ వేడుకలను యోగానంద ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మ స్ఫటికలింగేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. లోక కల్యాణార్థం హోమాలు నిర్వహించారు. మహాలక్ష్మీ అష్టోత్తర మంత్రం పఠించి అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. అన్నప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో యోగా సాధకులు తిమ్మయ్య, వాసు, శ్రీనివాసరెడ్డి, రాజు, భక్తులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్రగా గోవింద స్వాములు



తిరుమలకు పాదయాత్రగా బయలుదేరుతున్న భక్తులు

మిడుతూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గోవింద మాలధారులు శుక్రవారం మిడుతూరు గ్రామంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం వద్ద నుంచి తిరుమలకు బయలుదేరారు. గోవింద స్వాములు గత 29 ఏళ్ల పాదయాత్రగా వెళ్తున్నారు. 41 రోజుల పాటు పూజలు నిర్వహించి ఇరుముడితో బయలుదేరారు. గోవింద స్వాముల వెంట మిడుతూరు, పీరుసాహేబ్ పేట, సుంకేసుల, శాతనకోట, అల్లూరు, చింతలపల్లి, చెరుకుచెర్ల, తిమ్మాపురం, జలకనూరు, నందికొట్కూరు, కర్నూలు, తూడిచెర్ల, పారుమంచాల, కనకయ్యకొట్టాల, రుద్రవరం, కొత్తపల్లి, గని, నంద్యాల, టంగుటూరు, తదితరు గ్రామాల నుంచి దాదాపు 300 మంది భక్తులు తిరుమల తిరుపతికి పాదయాత్రగా వెళ్లారు.

కమనీయం.. లక్ష్మీరంగనాయక స్వామి కల్యాణం

గడివేముల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వండుట్ల గ్రామ శివారులో వెలసిన లక్ష్మీరంగనాయక స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పుష్కరిణిలో స్నానం చేయించారు. స్వామివారికి గణపతి పూజ చేశారు. అమ్మవారి తరపున మధునాయక్ దంపతులు, రాజునాయక్ దంపతులు ఉండగా స్వామి వారి తరపున వెంకటనాయుడు దంపతులు, రామకృష్ణ దంపతులు ఉండగా ఆలయ అర్చకులు నరసింహస్వామి వేద మంత్రోచ్చరణలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రీన్‌కో వారి సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, హర్షవర్ధన్, నారాయణరెడ్డి, వండుట్ల సర్పంచ్ గంగాధర్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వండుట్లలో పొట్టేళ్ల పోటీలు



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

గడివేముల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వండుట్ల గ్రామ శివారులో వెలసిన లక్ష్మీరంగనాయకస్వామి ఆలయ ప్రాంగణంలో తిరునాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన పొట్టేళ్ల పందెం ఆకట్టుకుంది. ఈ పోటీలలో రెవనూరు రమేష్, రెవనూరు సాయి, నంద్యాల రమేష్, ప్రసాద్ పొట్టేళ్లు వరుసగా నాలుగో స్థానాల్లో నిలవగా వరుసగా గెలుపొందిన పొట్టేలు యజమానులకు నిర్వాహకులు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.2 వేలు అందజేశారు.

జిల్లాలో గట్టి బందోబస్తు

- కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణ

నంద్యాల క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం హోలీ పండుగ సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీకెమెరాల ద్వారా బందోబస్తు చర్యలను ఏఎస్పీ యుగంధర్‌బాబు, ఎస్డీపీవో మంద జావళి ఆల్ఫోన్స్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు పోలీస్ సిబ్బంది, ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ రంగుల పండుగ జీవితాల్లో ఆనందం, శాంతిని నింపాలని ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలో గాంధీచౌక్, కల్పనాసెంటర్, శ్రీనివాససెంటర్, కొత్తమసీదు, విక్టోరియా రీడింగ్ రూమ్, ఓల్డ్ ఈద్గా, సంజీవనగర్, ఆత్మకూరు బస్టాండ్ సర్కిల్‌తోపాటు టూ టౌన్, త్రీ టౌన్ ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లు, ఏరియాల్లో బ్లూకోల్ట్స్ వాహనాలతో, డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా దస్తగిరి స్వామి జెండా ఉత్సవం



పెద్దవంగలిలో దస్తగిరి స్వామి జెండాతో ఊరేగింపు చేస్తున్న ప్రజలు

చాగలమర్రి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద వంగలిలో శుక్రవారం తెల్లవారుజామున దస్తగిరి స్వామి జెండాలను ఎద్దుల బండ్లపై గ్రామోత్సవం చేశారు. అనంతరం దర్గా వద్దకు తీసుకెళ్లి కొలువుదీరింపజేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్ర మంలో దర్గా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా జమాల్‌వలి స్వామి గంధం

చాగలమర్రి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంపల్లె గ్రామంలో వెలసిన జమాల్‌వలిస్వామి ఉరుసు సందర్భంగా శుక్రవారం గంధం నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు దర్గాలో ఫాతెహాలు, కానుకలు సమర్పించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దర్గా డైరెక్టర్లు పెద్దపుల్లారెడ్డి, చిన్నపుల్లారెడ్డి పాల్గొన్నారు.

దిగువ అహోబిలంలో విశేష పూజలు



రథం వద్ద పూజలు చేస్తున్న జగత్ విఖ్యాత్‌రెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 14(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన దిగువ అహోబిలంలో టీడీపీ ఆళ్లగడ్డ నియోజకవర్గ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. అహోబిలేశుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దిగువలో అంగరంగ వైభవంగా జరిగిన రథోత్సవంలో జగత్ విఖ్యాత్‌రెడ్డి పాల్గొన్నారు. రథంలో కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రహ్లాదవరద స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జగత్ విఖ్యాత్‌రెడ్డి ప్రారంభించారు.

భక్తులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 14(ఆంధ్రజ్యోతి): దిగువ అహోబిలంలో శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తుల రథోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న అశేష జనసందోహానికి రంగారావు గోష్ఠి సభ్యులు మజ్జిగ, పానకం, వడపప్పు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏడీఈ దొడ్ల రవికాంత్ చౌదరి, ఉప్పల ప్రసాద్, మల్లె వీరచంద్ర, శేషు నాయక్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి



మురుగు నీటిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

డోన్ టౌన్ / రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్‌నగర్, నల్లగుట్ట కాలనీలో తాగునీరు సౌకర్యం, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, పట్టణ కమిటీ సభ్యులు శివరాం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయా కాలనీల్లో ప్రజా చైతన్య యాత్ర నల్లగుట్ట, శ్రీరామ్ నగర్, వైఎస్ నగర్ కాలనీల్లో సీపీఎం నాయకుల బృందం పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా కాలనీల ప్రజలు అసౌకర్యాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సౌకర్యాలు కల్పించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసులు, కుళ్లాయప్ప, అశోక్, కేవీపీఎస్ నాయకులు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కారు బోల్తా.. మహిళకు గాయాలు

చాగలమర్రి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు మెట్ట సమీపంలో 40వ జాతీయ రహదారిపై కారు బోల్తా పడి ఒకరు గాయపడ్డ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం అలంపూరుకు చెందిన కుటుంబ సభ్యులు తిరుపతికి కారులో వెళ్తుండగా మద్దూరు మెట్ట సమీపంలో 40వ జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తా పడి పడి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో జయమ్మ అనే మహిళ గాయపడింది. గాయపడ్డ జయమ్మను టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.



ఉమ్మాయిపల్లె తండాలో హోలీ సంబరాల్లో పాల్గొన్న ప్రజలు



ముత్యాలపాడు తండాలో రంగులు చల్లుకుంటున్న విద్యార్థులు, గిరిజనులు

అంబరాన్నంటిన హోలీ సంబరాలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- వేడుకల్లో సందడి చేసిన యువత, చిన్నారులు



ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణ పరమాత్ముడు



ఎం.తండాలో రంగులు చల్లుకుంటున్న గిరిజన యువకులు

కొలిమిగుండ్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఉమ్మాయిపల్లె తండా గ్రామంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి, లైన్ ఇన్‌స్పెక్టర్ జయానాయక్, మాజీ సర్పంచ్ పీరునాయక్, లక్ష్మీనారాయణ, శీను తదితరులు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా వీధుల్లో చేరి రంగులు చల్లుకున్నారు. బెలుం, అంకిరెడ్డిపల్లె, ఇటిక్యాల గ్రామాల్లోని శ్రీకృష్ణ మందిరాల్లో హోలీ, పాల్గుణ పౌర్ణిమ పురస్కరించుకొని పూజలు నిర్వహించారు.

చాగలమర్రి: మండలంలోని ఎం.తండా, ఓజీ తండా, కేపీ తండా గ్రామాల్లో సుగాలిలు, గిరిజనులు శుక్రవారం హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు, యువకులు, మహిళలు ఆనందోత్సాహాల మధ్య రంగులు చల్లుకుంటూ నృత్యం చేస్తూ పండుగను వైభవంగా జరుపుకున్నారు. గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

బేతంచెర్ల : మండలంలో గోరుమాను కొండ తండా, బుగ్గానిపల్లె తండా గిరిజన గ్రామాల్లో హోలీ పండుగ సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గిరిజనుల కుల దైవాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం చిన్నారులు, మహిళలు, యువకులు హోలీ పండుగ జరుపుకున్నారు. కార్యక్రమంలో తండా పెద్దలు రవీంద్ర నాయక్, పవన్, గోపి, వినోద్, విజయ్ గౌతమ్, లోకేశ్, పవన్, లచ్చిబాయ్ పాల్గొన్నారు.

డోన్ రూరల్: పట్టణంతోపాటు పలు గ్రామాల్లో హోలీ సంబరాలు ప్రజలు సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ముఖ్యంగా యువత, చిన్నారులు రంగులు చల్లుకుంటూ, కేరింతలు చేస్తూ ఆనందంగా జరుపుకున్నారు.

ప్యాపిలి: మండలంలోని సీతమ్మ తండా, అలేబాదు తండా గ్రామాల్లో ప్రజలు హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు, పిల్లలు రంగులు చల్లుకొని సంబరాలు జరుపుకున్నారు. అలాగే ప్రజలు గ్రామాల్లో సేవాలాల్ మహరాజ్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



డోన్‌లో రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాలు చేసుకుంటున్న చిన్నారులు

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి : సీఐ

బనగానపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యాపారులు ట్రాఫిక్ నియంత్రణలో సహకరించాలని సీఐ ప్రవీణ్‌కుమార్ కోరారు. శుక్రవారం బనగానపల్లె పోలీస్‌స్టేషన్‌లో వ్యాపారులతో సీఐ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పట్టణ రోడ్లు ఇరుకుగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందన్నారు. ఇందుకు వ్యాపారులు సహకరించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఇష్టమొచ్చిన సమయంలో సరుకు లారీలు పట్టణంలోకి వస్తుండడంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందన్నారు. పట్టణంలో ఉదయం 8 గంటల లోపు, రాత్రి 8 గంటల తరువాత భారీ వాహనాలకు పట్టణంలో అనుమతులు ఇస్తామన్నారు. ప్రతిరోజు రెండు మొబైల్ టీంలను ఏర్పాటు చేసి ద్విచక్రవాహనాలు, ఆటోలకు పార్కింగ్ ఒక వైపు పెట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



పట్టణంలోని వ్యాపారులకు సూచనలు ఇస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

కనకదుర్గమ్మను దర్శించుకున్న మంత్రి బీసీ



మంత్రి బీసీ కుటుంబ సభ్యులను ఆశీర్వాదిస్తున్న అర్చకులు

బనగానపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శుక్రవారం కుటుంబ సమేతంగా విజయవాడ ఇంద్ర కీలాద్రిపై కనకదుర్గామాతను దర్శించుకున్నారు. మంత్రి బీసీతో పాటు ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ, కుమార్తె బీసీ మనోహరమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా మంత్రి దంపతులకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి దంపతులు దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ అధికారులు మంత్రి కుటుంబ సభ్యులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఈ-శ్రమ్ కార్డుతో కార్మికులకు లాభాలు

- శోభారాణి, కార్మిక శాఖ డివిజనల్ అధికారి



కొలిమిగుండ్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ-శ్రమ్ కార్డులతో అసంఘటిత కార్మికులకు ప్రయోజనం చేకూరనుందని బనగానపల్లె డివిజన్ కార్మిక శాఖ అధికారి శోభారాణి అన్నారు. శుక్రవారం ఆమె 'ఆంధ్రజ్యోతి' మాట్లాడారు.

ప్రశ్న: ఏఏ వర్గాలు అసంఘటిత కార్మికుల జాబితా కిందకు వస్తారు..?

జవాబు: ఉపాధి, రైతు కూలీలు, లోడింగ్, అన్‌లోడింగ్, కల్లు గీత కార్మికులు, చేనేత, టైలర్లు, కమ్మరి, కుమ్మరి, బీడీ కార్మికులు, స్వర్ణకారులు, రజకులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లకు ఈ-శ్రమ్‌లో నమోదయ్యే అవకాశం ప్రభుత్వం కల్పించింది.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎంత మంది అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్ కార్డుల రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారు?

జవాబు: డివిజన్ పరిధిలో 1,27,765 మంది అసంఘటిత కార్మికులను ఈ-శ్రమ్ కార్డుల జాబితాలోకి తీసుక రావాల్సన్నది లక్ష్యం. ఇప్పటి వరకు సుమారు 50వేల మంది కార్మికుల ను ఈ జాబితాలోకి తీసుకవచ్చాం. గడచిన రెండు నెలల్లోనే 2000మంది కార్మికులకు ఈ-శ్రమ్ కార్డుల రిజిస్ట్రేషన్ చేయించ గలిగాం.

ప్రశ్న: ఈ-శ్రమ్ కార్డులపై కార్మికులకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

జవాబు: ఈ-శ్రమ్ కార్డుల ప్రాధాన్యతపై అసంఘటిత కార్మికులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. ఇందు కోసం ఉపాధి అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, గని కార్మిక సంఘాల నాయకులు ఇలా అనేక శాఖల సమన్వయంతో ఆయా వర్గాలకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: ఈ-శ్రమ్ కార్డుల ద్వారా అసంఘటిత కార్మికులకు కలిగే లబ్ధిని వివరించండి?

జవాబు: ఈ-శ్రమ్ నమోదు చేసుకుంటే రూ. రెండులక్షల ఉచిత ప్రమాద బీమా లభిస్తుంది. ప్రమాద సమయాల్లో గాయపడినా, అంగవైకల్యం కలిగినా రూ.రెండు లక్షల వరకు కార్మికులకు లబ్ధి చేకూరుతుంది.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శికి మాతృ వియోగం

- పలువురు ప్రముఖుల నివాళి

కొలిమిగుండ్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి మాతృమూర్తి రామక్క(80) అనారోగ్యంతో గురువారం రాత్రి కన్ను మూశారు. టీడీపీ సీనియర్ నాయకుడు బీవీ పక్కీరారెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి, ఇలిక్యాల బాలిరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు గొంగటి హుస్సేన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి నంద్యాల ప్రసాదు, రవి ప్రకాశ్‌రెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, నాయుడు, కార్యకర్తలు అంకిరెడ్డిపల్లెకు చేరుకొని రామక్క మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ రాష్ట్ర నంద్యాల రామేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి: ఏఈ



ఏఈ అనంతరావు

కోవెలకుంట్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల, దొర్నిపాడు మండలాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కోవెలకుంట్ల విద్యుత్ ఏఈ సీహెచ్ అనంతరావు అన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని విద్యుత్ ఏఈ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల తాను నెల్లూరు నుంచి బదిలీపై వచ్చానన్నారు. గ్రా మాల్లో నిత్యం పర్యటి స్తూ సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామ న్నారు.

గ్రామాల అభివృద్ధి

కోవెలకుంట్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని వల్లంపాడు సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో గ్రామీణ రహదారులు అధ్వా నంగా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ గ్రామాల అభి వృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి సీసీ రోడ్లు వేయిస్తున్నా రన్నారు. వల్లంపాడులో బీసీ, ఎస్టీకాలనీల్లో సీసీరోడ్లు వేయించామన్నారు.

పప్పు శనగలకు మద్దతు ధర

కోవెలకుంట్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పప్పుశెనగకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో పప్పుశెనగ రేటు తక్కుగా ఉందన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.5650ల కొనుగోలు చేసేందుకు నిర్ణయిందన్నారు. గ్రామ రైతు సేవా కేంద్రంలో రిజిస్టరు చేసుకోవాలన్నారు.

నీటిని పొదుపుగా వాడాలి

చాగలమర్రి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వేసవి సమీపిస్తుండటంతో నీటిని పొదుపుగా వాడుకోవాలంటూ మర్రిపల్లెకు చెందిన అబ్దుల్‌గఫార్ శుక్రవారం చాగలమర్రి గ్రామంలో ఆటోయాత్ర చేశారు. ప్రతి ఒక్కరు దైవమార్గంలో నడవాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు ఉన్నారు.

శ్మశాన వాటిక సమస్య పరిష్కారం

రుద్రవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్తలూరు గ్రామంలో హిందూ శ్మశాన వాటిక సమస్య పరిష్కరించినట్లు తహసీల్దారు మల్లిఖార్జునరావు శుక్రవారం తెలిపారు. గ్రామస్థులు ఈ నెల 3న కలెక్టరుకు శ్మశనవాటిన సమస్యపై వినతిపత్రం అందించారు. ఆమె ఆదేశాలతో రెవెన్యూ అధికారులు గ్రామానికి వెళ్లి శ్మశానవాటిక సరిహద్దులు ఏర్పాటు చేయించామన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ వేడుకలు



ప్యాపిలిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

బేతంచెర్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలును జనసేన మండల నాయకులు శ్రీకంఠ మధు, మనోజ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బేతంచెర్ల పట్టణంలో ప్రభుత్వ సామాజిక కమ్యూనిటీ ఆసుపత్రిలో బాలింతలకు, గర్భిణులకు, రోగులకు జనసేన కార్యకర్తలు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని పాతబస్టాండులో మధ్యాహ్నం మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే అనాథ శరణాలయం వద్ద చిన్న పిల్లలతో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో శ్రీకంటి మధు, ఎర్రం మనోజ్ కుమార్, ఆవుల రాజశేఖర్, పోల మధు సుబ్బయ్య జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో శుక్రవారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, సురేష్, రంగస్వామి, సుధాకర్, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మానస లింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వాసాపురం మానస లింగేశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

రుద్రవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాసాపురం లో కొలువుదీరిన మానస లింగేశ్వరుడు, త్రిపుర సుందరీ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అర్చకులు శివశర్మ తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకి సేవ

బనగానపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీసేవ నిర్వహించారు. ఈవో కామేశ్వరమ్మ, మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

రుద్రవరం : రుద్రవరంలో చౌడేశ్వరి అమ్మవారికి పూజలు చేశారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం చేశారు. మహిళలు చీరలు, పట్టువస్త్రాలు సమర్పించారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ వితరణ



చాగలమర్రిలో ట్రై సైకిల్ వితరణ చేస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాతబస్టాండులో జీఎంఎస్ ఆగ్రో ఆధ్వర్యంలో దివ్యాంగుడు సురేష్‌కు ట్రైసైకిల్‌ను టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా శుక్రవారం పంపిణీ చేశారు. దాతలు కొలిమి మాబుషరిఫ్, అనిఫ్‌లు ట్రైసైకిల్, దుస్తులను అందజేశారు. రంజాన్‌మాసం సంద ర్భంగా పేదలకు దానధర్మాలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మౌలాలి, కొలిమి షబ్బీర్, ఆస్రఫ్, లాజమ్, జల్సాగౌస్, జెట్టి బాలుడు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తున్న సుబ్బారెడ్డి

బేతంచెర్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పవిత్ర మాసంలో ముస్లింలకు టీడీపీ నాయకుడు నారాయణ స్వామి ఘనంగా ఇఫ్తార్‌ను శుక్రవారం రాత్రి ఇచ్చారు. పట్టణంలోని అన్ని మసీదులకు చెందిన ముస్లింలకు శ్రీనగర్ కాలనీలోని షాదీఖానాలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా సీడ్స్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి, టీడీపీ పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరి హాజరై విందును వడ్డించారు. ముస్లింలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోసం చేయడమే జగన్‌కు తెలుసు

- డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్ రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలను మోసగించడంలో మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆరి తేరిపోయారని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో యువతను నట్టేట ముంచిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు వస్తున్నాయని, యువతకు ఉపాధి కల్పించే దిశగా మంత్రి లోకేశ్ శ్రమిస్తున్నారని కొనియాడారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

శిరివెళ్ల, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : చెట్టుమీద నుంచి పడి తీవ్రంగా గాయపడిన ఓ వృద్ధుడు చికిత్సపొందుతూ మృతి చెందాడు. శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాలివీ.. గ్రామంలోని తెలుగుపేటకు చెందిన ముత్యాల నరసింహుడు(70) అనే వృద్ధుడు ఈ నెల 13న రుద్రవరం మలుపులో ఉన్న చెట్టుపైకి ఎక్కి చింతకాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం కుటుంబీకులు 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ ఆయన చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య ముత్యాల ఓబుళమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రుద్ర వరంలో కొలువుదీరిన కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్యులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పూజలనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ప్యాపిలిలో పట్టపగలు చోరీ

ప్యాపిలి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ ఇంట్లో శుక్రవారం పట్టపగలు చోరీ జరిగింది. అయితే ఇంటి యజమాని ఊరికి వెళ్లినందున వివరాలు తెలిసిరా లేదు. డోన్ రోడ్డు సమీపంలో నివాసముంటున్న ప్రసాద్ వైద్యం కోసం రెండురోజుల క్రితం నంద్యాలకు వెళ్లాడు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలోని బ్యాగులను, చల్లాచెదరు చేశారు. ఇరుగు పొరుగు వారి ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనస్థలాన్ని పరిశీలించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ నాగార్జున తెలిపారు.

నేడు స్వచ్ఛదివస్

చాగలమర్రి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఈవోఆర్డీ తాహిర్‌హుస్సేన్ శుక్రవారం తెలిపారు. గాంధీ సెంటర్ నుంచి పాతబస్టాండు, ఈద్గా వద్ద స్వచ్ఛత కార్యక్రమా న్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

పంచాయతీ కార్యదర్శిపై కేసు నమోదు

శిరివెళ్ల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల గ్రా మంలోని సచివాలయం-2లో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన శిరీష్ బాబుపై శుక్రవారం కేసు నమోదైంది. సామాజిక భద్రత పింఛను సొమ్మును పక్కదారి పట్టించడంతో కలెక్టరు ఇటీవల సస్పెండ్ చేశారు. 2020 జూన్ నుంచి 2022 జనవరి మధ్య కాలంలో శిరీష్ బాబు రూ.8.48 లక్షల పింఛను సొమ్మును లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడ్డాడు. దొంగ చలానాలతో ప్రభుత్వాన్ని సైతం మోసగించి విధులకు రాకుండా తప్పించుకుని తిరుగుతున్నట్లు అధికారు ల విచారణలో వెల్లడైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశా రు. దీంతో శిరీష్ బాబుపై ఐపీసీ 409, 417, 468 సెక్షన్ల కింద చీటింగ్ కేసునమోదు చేసినట్లుఎస్ఐ చిన్న పీరయ్య శుక్రవారం తెలిపారు.